గుంటూరు

బుధవారం ; 27 ; నవంబర్ ; 2024



చెన్నకేశవస్వామికి పూజలు

కొల్లిపర : తూములూరులోని చెన్నకేశవ స్వామిగుడిలో చెన్నకేశవ గీతా భక్త భజన బృందం మంగళవారం గీతాపారాయణం చేసింది. తొలుత స్వామికి పూజలు చేశారు.



ఏకాదశ రుద్రాభిషేకం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులి వర్రులోని బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామిగుడిలో మంగళ వారం ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు.

వల్లభేశ్వరునికి ఏకాదశి పూజలు



రొంపిచర్ల: విప్పర్ల గ్రామంలోని గంగా పార్వతీ సమేత వల్లభే శ్వరస్వామి ఆలయం లో కార్తిక ఏకాదశి పూజలను మంగ ళవారం నిర్వహించారు. ఏకాదశి రుద్రాభిషేకాలు చేశారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

దేశానికి అంబేడ్కర్ అందించిన వరం రాజ్యాంగం



గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి అందించిన గొప్పవరం రాజ్యాంగమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ. భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లౌకిక, సామాజిక అంశాలతో కూడిన గొప్ప రాజ్యాంగంగా తీర్చిదిద్దారని కొనియాడారు. వందల దేశాల రాజ్యాంగాలను పరిశీలించిన తర్వాత అన్ని కోణాల్లో ఆలోచించి అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన అతిపెద్ద లిఖిత రాజ్యాంగానికి రూపకల్పన చేశారని అన్నారు. ప్రపంచం మెచ్చే గొప్ప మేధావిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషికి 75 ఏళ్ల రాజ్యాంగ దినోత్సవమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీఐ జీఎంగా రాజేంద్ర షా

కొరిటెపాడు: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్‌గా రాజేంద్ర షాను నియమిస్తూ మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఐ పత్తి కొనుగోలు విషయంలో ఇప్పటి వరకు జీఎంగా పనిచేసిన అమర్‌నాథ్‌రెడ్డిపై రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో ఆయనపై బదిలీ వేటు వేసినట్లు తెలుస్తోంది. సీసీఐ కార్యాలయంలో ఓఎస్‌డీగా ఆయన్ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో రాజేంద్ర షా బాధ్యతలు స్వీకరించనున్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం



తెనాలి: పవిత్ర కార్తిక మాసం ఏకాదశి రోజైన మంగళవారం సాయంత్రం స్థానిక బాలాజీరావుపేటలోని శ్రీపట్టాభి రామస్వామి దేవస్థానంలో కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. వార్డు మున్సిపల్ కౌన్సిలర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పేరం సంజీవరెడ్డి–వరలక్ష్మి దంపతులచే ఈ కార్యక్రమాన్ని జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుందరాచారి, పూజారి నాగమారుతి, మెట్టు శ్రీనివాసరెడ్డి, రమాదేవి, భక్తులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్య సేవలకు 104కు ఫోన్ చేయాలి

గుంటూరు మెడికల్ : 108 వాహన సిబ్బంది సమ్మె కారణంగా అత్యవసర పరిస్థితిలో, వాహన సదుపాయం కావలసిన వారు 104కు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇతర సహాయ, సలహాలు పొందటానికి సెల్ నెంబర్ 72075 95104 ను సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



పెదకాకాని: శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం కార్తిక మాసం ఏకాదశి సందర్భంగా దాతల సహకారంతో స్వామికి లక్ష బిల్వార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని దేవస్థానం స్థానాచార్యులు పొత్తూరు సాంబశివరావు, ప్రధాన అర్చకులు పొత్తూరు లక్ష్మీనారాయణ వరప్రసాద్ ఆధ్వర్యంలో దేవస్థాన వేద పండితులు, అర్చక స్వాములు చేశారు. సహస్ర నామాలతో రుత్విక్కులు లక్ష బిల్వ దళార్చన నిర్వహించారు. అనంతరం భ్రమరాంబ వారికి లక్ష కుంకుమార్చన చేశారు. ఆలయ ఉప కమిషనర్ కేబీ శ్రీనివాసరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

4న వికాస ఎన్నికలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధ్యాపకేతర ఉద్యోగ సంఘం (వికాస) కార్యవర్గానికి ఎన్నికలు డిసెంబర్ 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఆచార్య ఎస్. మురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు వికాస మాజీ కార్యవర్గంతో మంగళవారం ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించారు.

మండిన గుండెలు

- రోడ్డెక్కిన చిరుద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ప్రజా సంఘాలు
- కలెక్టరేట్ ఎదుట నిత్యం ఆందోళనలు
- 108 సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లకు తీవ్ర అన్యాయం

కూటమి ప్రభుత్వంపై ఐదు నెలల్లోనే వ్యతిరేకత



చిరుద్యోగుల వెతలు తీర్చాలని వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: సూపర్ సిక్స్ అంటూ హామీల వర్షం కురిపించిన కూటమి నేతలు... అధికారంలోకి వచ్చాక ఇప్పుడు చేతులెత్తేశారు. ఎన్నికల ప్రచారంలో గెలుపే లక్ష్యంగా నోటికొచ్చిన హామీలను అడ్డగోలుగా ఇచ్చేశారు. ఇప్పుడు అమలు విషయానికి వచ్చేసరికి ఆ మాటే ఎత్తడం లేదు. దీంతో మాట నిలుపుకోవాలని ప్రజా సంఘాలు, చిరు ఉద్యోగులు ఉద్యమ బాట పడుతున్నారు. ప్రతి రోజూ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఇంతటి వ్యతిరేకత మూటగట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది. చాలీచాలని జీతాలు వస్తున్న వర్గాలకు ఉద్యోగ భద్రతతోపాటు జీతాలు రెట్టింపు చేస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు. అన్నివర్గాలకూ తీవ్ర అన్యాయం చేస్తున్నారు. వలంటీర్ల విషయానికి వస్తే వారికి నెలకి రూ.పది వేల గౌరవ వేతనం ఇస్తామని చెప్పారు. ఇటు చంద్రబాబు నాయుడు, అటు పవన్ కళ్యాణ్ కూడా ఆ హామీని అమలు చేయలేదు. పైగా అసలు వలంటీర్ వ్యవస్థనే ప్రశ్నార్థకంగా మార్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ డీలర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఆశా వర్కర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు... ఇలా చిరుద్యోగులను టార్గెట్ చేసుకుని ఉద్యోగాల నుంచి తొలగించారు. లక్షల కుటుంబాల పొట్ట కొట్టారు. 108 సర్వీస్‌లను ప్రభుత్వమే నిర్వహించాలని, ఇందులో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఆందోళనల బాట..

- విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా నిర్వహించింది.
- పెదనందిపాడు సొసైటీలో రైతులకు రుణాలు ఇవ్వాలని సొసైటీ ముందు రైతు సంఘాలు ఇటీవల ధర్నా నిర్వహించాయి.
- నిత్యావసర సరకుల ధరల పెరుగుదల, మహిళలపై వేధింపుల నివారణ, నిరుద్యోగం అరికట్టడానికి చర్యలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు వంటి డిమాండ్లతో నవంబర్ 11వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది.
- ఇంధన సర్దుబాటు చార్జీలు, విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపకూడదని, ఆ ప్రతిపాదన విరమించుకోవాలని విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం జరిగింది.
- ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.







ఉచిత ఇసుక పేరిట మోసం అంటూ ఆందోళన.. రైతుల సమస్యలపై పోరుబాట.. విద్యుత్ చార్జీల భారం మోపవద్దంటూ ఆందోళన

వరికి వాయుగండం

వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆందోళనలో అన్నదాతలు

- నూర్పిళ్లకు ఆటంకం కలిగే అవకాశం
- ఇప్పటికే వర్షాలతో కుదేలైన రైతులు
- గిట్టుబాటు ధర దక్కక విలవిల
- మళ్లీ వానలు పడితే మరింత నష్టం
- మద్దతు ధరకు ప్రభుత్వమే ధాన్యం కొనాలని పెరుగుతున్న డిమాండ్లు



దావులూరులో నూర్పిడి చేసిన వెంటనే ధాన్యాన్ని లారీలో లోడు చేస్తున్న దృశ్యం

తెనాలి: దక్షిణ బంగాళాఖాతం, తూర్పు హిందూ మహాసముద్రం మధ్య ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి బలపడింది. దక్షిణ కోస్తాలోనూ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నెల 29వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని చేసిన హెచ్చరికలు డెల్టా రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో కొన్నిచోట్ల వరి నూర్పిళ్లు వేగం పుంజుకున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో వరి కంకులు పాలుపోసుకునే దశలో ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే పంటకు నష్టం వాటిల్లే ప్రమాదముంది.

కోతకు సిద్ధంగా పైరు

గుంటూరు జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 1,59,332 ఎకరాలు. 2025–26 ఖరీఫ్ సీజనుకు 1,41,020 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో హెచ్చుభాగం వెద పద్ధతిలోనే సాగైంది. కృష్ణా పశ్చిమ డెల్టా పంట కాల్వల వ్యవస్థకు ఎగువ భూములైన తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర, వేమూరు, చుండూరు మండలాల్లో వరి పైరు కోతకు వచ్చింది. కొద్దిరోజుల క్రితం కొల్లిపర మండల గ్రామం తూములూరులో రైతులు హార్వెస్టింగ్ యంత్రాలతో నేరుగా కోత/నూర్పిడి మొదలుపెట్టారు. ఆ గ్రామంలో నూర్పిళ్లు పూర్తి కాగా, ఇతర గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. కొల్లిపరతోపాటు తెనాలి, దుగ్గిరాల, సమీప బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు, చుండూరు మండలాల్లోనూ నూర్పిళ్లు జరుగుతున్నాయి. వాయుగుండం హెచ్చరికలతో నూర్పిన ధాన్యాన్ని నూర్చినట్టే గంటల వ్యవధిలోనే వ్యాపారులు కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారు. జిల్లాలోని గుంటూరు డివిజనులో వరి పైరు ప్రస్తుతం గింజ పాలుపోసుకునే దశలో ఉంది. భారీ వర్షాలు కురిస్తే వరికి ప్రమాదమని రైతులు ఆందోళన పడుతున్నారు. బీపీటీ–5204 రకం కంకుల భారంతో నేలకు వాలుతుంది. చేలల్లో నిలిచిన నీరు వెంటనే బయటకుపోతే సమస్య ఉండదు. కొన్నిరోజులు వ్యవధి తీసుకుంటే ధాన్యం గింజలు మొలకెత్తే ప్రమాదం ఉంటుంది. ధాన్యం రంగు మారుతుంది. పాలుపోసుకునే దశలో ఉన్న వరికి కూడా ఇదే వర్తిస్తుంది.

దక్కని గిట్టుబాట ధర

ప్రస్తుతం నూర్పిడి చేసిన ధాన్యాన్ని రూ.1400లకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. యంత్రాలతో కోసిన ధాన్యానికి సహజంగానే తేమశాతం ఎక్కువగా ఉంటుంది. ఈ సాకుతో రూ.1,400లకే కొంటున్నారు. ధాన్యానికి మద్దతు ధర రూ.1,740 ఉండగా ప్రస్తుత మార్కెట్‌తో రైతులు బస్తాకు రూ.300కుపైగా నష్టపోతున్నారు. జిల్లాలో తూములూరు, వేమూరులోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. మిల్లర్లతో కొనుగోలును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తే మేలన్న డిమాండూ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో వాయుగుండం ఫలితంగా భారీ వర్షాల హెచ్చరికలు అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏదోలా ఈ గండం గట్టెక్కాలని కోరుకుంటున్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అంబటి రాంబాబు తదితరులు

రాష్ట్రంలో అమలులో లేని రాజ్యాంగం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు
- వేధింపులు మాని పాలనపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచన

నెహ్రూనగర్: ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించారని.. కానీ రాష్ట్రంలో అది అమలు కావడం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. రాజ్యాంగం అందరికీ హక్కులు, స్వేచ్ఛను కల్పించిందన్నారు. రాష్ట్రంలో నారా లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లో ఉందని తెలిపారు. ప్రభుత్వానికి కక్ష సాధింపు తప్ప పాలనపై దృష్టి లేదన్నారు. పోలీసులకు నారా లోకేశ్ ఆదేశాలు ఇచ్చి మరీ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై 10 నుంచి 15 కేసులు అక్రమంగా పెట్టి, కోర్టుల చుట్టూ తిప్పుతూ భయాందోళనలకు గురి చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వీటికి ఎవరూ భయపడే పరిస్థితులు లేవన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజ నారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ లాల్‌పురం రాము, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు మెట్టు వెంకటప్ప రెడ్డి, షేక్ మస్తాన్ వలి, కుమ్మరి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జులు నూనె ఉమామహేశ్వర్ రెడ్డి, బందా రవీంద్ర, గుంటూరు గ్రంథాలయ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకట కృష్ణమాచారి, షేక్ రోషన్, రామనబోయిన అజయ్, మొహమ్మద్ అబీద్‌బాషా, అచ్చాల వెంకట రెడ్డి, ధూపాటి వంశీ, పూనూరి నాగేశ్వరరావు, ఎరువ సాంబిరెడ్డి, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు గనిక ఝాన్సీ, పిల్లి మేరీ, కొత్త చిన్నపరెడ్డి, మాజీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొలుకులూరి కోటేశ్వరరావు, రాష్ట్ర వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి కొరటిపాటి ప్రేమ్ కుమార్, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బైరెడ్డి రవీంద్రారెడ్డి, పార్టీ నాయకులు ముత్యాల రాజు, సత్తెనపల్లి రమ్య, చిన్న ఎలమంద, వలివేటి వెంకట రమణ, మర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

మన రాజ్యాంగం ఒక అద్భుతం



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధిస్తున్న భారత రాజ్యాంగం ఒక అద్భుతమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కొనియాడారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపరచిన అంశాలు అందర్నీ ఒక్కటిగా కలిపి ఉంచుతాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఆమోదించినప్పటి నుంచి తారతమ్యం, లింగబేధం లేకుండా అర్హులైన అందరికీ ఓటు హక్కు లభించిందని చెప్పారు. రాజ్యాంగంలో గుంటూరు జిల్లా వాసి ఆచార్య రంగా పాత్ర ఉండడం గర్వకారణమని కొనియాడారు. ముఖ్యంగా ఆర్టికల్ 21 అందరూ సమానమని వివరిస్తుందన్నారు. అనంతరం డీఆర్వో ఖాజావలి అందరితో రాజ్యాంగ ప్రవేశికను చదివించారు. కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, సోషల్ వెల్ఫేర్ డీడీ మదుసూధనరావు, గిరిజన సంక్షేమ శాఖాధికారి మురళీధర్, ఎస్‌సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమ కుమారి, డీపీఓ సాయికుమార్, అధికారులు పాల్గొన్నారు.

అభ్యంతరాల పరిష్కారం కీలకం

స్పెషల్ సమ్మరీ రివిజన్–2025లో స్వీకరించిన అభ్యంతరాల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు ఎ.సూర్యకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో కలిసి అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు.

వార్డెన్లపై 'ప్రొటోకాల్' బర్డెన్

- సంక్షేమ హాస్టళ్లలో దోచుకుంటున్న అధికారులు
- ప్రతి నెలా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఇవ్వాల్సిందే
- లేదంటే తనిఖీలు, మెమోల పేరుతో బెదిరింపులు
- వేధింపులు భరించలేక అడిగినంత ఇస్తున్న వార్డెన్లు
- పరోక్షంగా ఆ భారం పిల్లల డైట్‌పై పడుతున్న వైనం

గుంటూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఫార్మాలిటీస్, ప్రొటోకాల్ ఖర్చుల పేరుతో డివిజనల్, జిల్లా అధికారులు హాస్టల్ వార్డెన్లను దోచుకుంటున్నారనే ఆరోపణలు తీవ్రంగా వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు సైతం సైలెంట్‌గా ఉండటంతో అధికారులు ఆడిందే ఆటగా మారిందనే చెప్పుకోవచ్చు. అడిగినంత ఇస్తే వారి చల్లని చూపు ఆయా వార్డెన్స్‌పై ఉంటుంది. లేదంటే నానా విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తుంటారనే ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల పెదనందిపాడు ఓ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థిని హాస్టల్ సిబ్బంది కొట్టిన విషయం తెలిసిందే. ఈ విషయంలో వార్డెన్‌పై చర్యలు తీసుకోలేదు.

నెహ్రూనగర్ : జిల్లాలోని ఎస్సీ హాస్టళ్లలో 2,503 మంది, ఎస్టీ వసతిగృహాల్లో 697 మంది, బీసీ హాస్టళ్లలో 2,179 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.30 చొప్పున డివిజనల్ ఆఫీసర్‌కి, జిల్లా ఆఫీసర్‌కి వెళుతున్నట్లు సమాచారం. మొత్తం రూ.60 వంతున ప్రతి నెల వార్డెన్లు సమర్పించుకోవాల్సిందే అనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పాటు జిల్లాకు ఆయా శాఖలకు సంబంధించిన మంత్రి, ఉన్నతాధికారులు వచ్చారంటే హాస్టల్ వార్డెన్ల నుంచే మొత్తం వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విధంగా ప్రతి నెల ఒక్కో వార్డెన్ నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఇస్తున్నారు. ఉదాహరణకు గుంటూరు జిల్లాలో ఎస్సీ హాస్టల్‌లో 2,503 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి నెల 3 నుంచి 4వ తరగతి వారికి రూ.1150, 5 – 10వ తరగతి విద్యార్థికి రూ.1,400, కాలేజీ విద్యార్థికి రూ.1600 చొప్పున డైట్ చార్జీలు ప్రభుత్వం వెండర్ (కందిపప్పు, గుడ్లు, నిత్యవసర సరుకులు సరఫరా చేసే వ్యాపారి)కి ప్రతి నెల జమ చేస్తుంది. ఇందులో ఒక్కో విద్యార్థికి రూ.60 చొప్పున 2,503 మంది విద్యార్థులకుగాను జిల్లాలో ఉన్న వార్డెన్లు అందరూ కలిసి నెలకు రూ.1.50 లక్షల వరకు సమర్పించుకోవాల్సి వస్తోంది. తద్వారా వార్డెన్లు విద్యార్థులకు ఇవాల్సిన డైట్‌లో కొంత మేర కోత విధిస్తున్నారు. ఆ డబ్బులు వెండర్ల నుంచి కొందరు వార్డెన్‌లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయి.



జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలకు సంబంధించిన కార్యాలయం

గ్రీవెన్స్‌కు ఖర్చులూ వీరివే?

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ (ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమానికి కూడా నెలలో ఒక వారం హాస్టల్ వార్డెన్స్ నుంచి వసూలు చేస్తుంటారని తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం వారి వరకు వెళుతున్నాయో.. లేదో.. అని వార్డెన్స్ ఒకింత సందేహం కూడా వ్యక్తం చేస్తున్నారు. గ్రీవెన్స్ పేరుతో అధికారులు వీటిని కూడా తినేస్తున్నారనే అభిప్రాయంలో కొందరు వార్డెన్స్ ఉన్నారు.

ఇంటి అద్దె కూడా వీరిదే..

జిల్లా అధికారుల ఇంటి అద్దె కూడా వార్డెన్ల నుంచే వసూలు చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. దీనికితోడు ఇంటి నిర్వహణ, కారు పెట్రోల్, టిఫిన్ ఖర్చులు.. ఇలా ప్రతి దానికీ నగదు వసూలు చేస్తున్నట్లు సమాచారం. హాస్టళ్లలో పనిచేయాల్సిన కుక్‌లు, కమాటీలు కూడా అధికారుల ఇళ్లల్లో పని చేస్తుంటారని సమాచారం. వీరి ఖర్చులు కూడా వార్డెన్లపైనే పడుతోంది. వీటన్నింటినీ డీల్ చేసేది అవుట్ సోర్సింగ్ సిబ్బందేనని వార్డెన్లు బహిరంగంగా చెబుతున్నారు. జిల్లా అధికారుల కన్నా ఈ సిబ్బంది ఫోన్ చేసి అడిగితే కోరింతన సమర్పించుకోవాల్సిందే. లేదంటే ఇబ్బందులకు గురి చేస్తుంటారని వార్డెన్లు చెబుతున్నారు.

వసూలు చేయడం లేదు

ప్రొటోకాల్ ఖర్చులపై ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూదన్‌రావును వివరణ కోరగా ... అటువంటి ఖర్చులు వార్డెన్ల నుంచి వసూలు చేయడం లేదని చెప్పారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ మయూరిని వివరణ కోరగా.. తాను కొత్తగా వచ్చానని.. అలాంటి వసూళ్లు తమ దృష్టికి లేదన్నారు. ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మురళీధర్‌ను సంప్రదించగా.. తమ డిపార్ట్‌మెంట్‌లో అలాంటి ఖర్చులు ఉండే అవకాశం లేదని చెప్పారు.

సైబర్ నేరాల బాధితులు 1930ను సంప్రదించాలి

నరసరావుపేట: సైబర్ నేరాల బాధితులు వెంటనే 1930ను సంప్రదిస్తే నష్టం నివారించవచ్చని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ శైలేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టౌన్ హాలులో సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. నరసరావుపేట రీజినల్ మేనేజర్ శ్రీరామ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాస్ఫూర్తి ఎంతో గొప్పది

వీసీ ఆచార్య కె. గంగాధరరావు



వెయిట్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొన్న క్రీడాకారిణి

ఏఎన్‌యూ: ఆటలలో గెలుపోటములకంటే క్రీడాస్ఫూర్తి ఎంతో గొప్పదని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్, వెస్ట్ జోన్ మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను వీసీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... క్రీడాకారులు లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. రెక్టార్ ఆచార్య కే రత్న షీలా మణి మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వంతోపాటు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ క్రీడలకు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తామన్నారు. తొలి రోజు పోటీలలో విజేతలకు పతకాలు అందజేశారు. ఆలిండియా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య టెక్నికల్ కమిటీకి చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి. జాన్సన్, అధ్యాపకులు డాక్టర్ ఇన్నయ్య, డాక్టర్ రామ్మోహన్రావు, డాక్టర్ డి. సూర్యనారాయణ పోటీల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

లక్ష్మీపురం: ఖరీఫ్ ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు.

నాన్న బాటలో నడిచాం

- రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమల రావు
- పాపినేని, చలానికి సీహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహితీ పురస్కారాలు ప్రదానం

నగరంపాలెం: తండ్రి సీహెచ్ లక్ష్మీనారాయణ చూపిన బాటలో తాము నడిచామని రాష్ట్ర డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమల రావు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలోని పద్మావతి కళా వేదికపై మంగళవారం సీహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహితీ పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ (2023), ప్రముఖ విమర్శకులు, రచయిత జీఎస్ చలం (2024)కు సీహెచ్.లక్ష్మీనారాయణ స్మారక సాహితీ అవార్డులను ప్రదానం చేశారు. వారిని నగదు, జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. ముఖ్య అతిథిగా ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ తండ్రి ఆశయాలకు అనుగుణంగా కష్టపడి విద్యనభ్యసించామని చెప్పారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నడిచామని అన్నారు. తండ్రి పేరుతో 2020 నుంచి స్మారక సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. విలువలతో కూడిన జీవన విధానాన్ని, క్రమశిక్షణను తమకు అందించారని పేర్కొన్నారు. తనతోపాటు సోదరి, సోదరుడు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అందించిన జీవిత విలువలు అమూల్యమైనవని అన్నారు. అధ్యక్షత వహించిన నిర్వాహకురాలు, రాష్ట్ర డీజీపీ సోదరి డాక్టర్ సీహెచ్ సుశీలమ్మ మాట్లాడుతూ కథ, నవల, కవిత్వానికి అనేక మంది అవార్డులు తీసుకునేవారని, కానీ తెలుగు రాష్ట్రాల్లో సాహితీ విమర్శలు చేసే వారికి అవార్డులు తాము ప్రదానం చేస్తున్నామని అన్నారు. ఇది సామాజిక బాధ్యతగా భావించామని పేర్కొన్నారు. ఐదేళ్లుగా ప్రముఖులకు ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఏపీ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానిదేవి అధ్యక్షత వహించగా, పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, విశ్రాంత ఎక్సైజ్ కమిషనర్ అహ్మద్ షరీఫ్, వైద్యులు ఓవీ.రమణ, వీవీ.రామకుమార్, రచయితలు, సాహితీవేత్తలు, విమర్శకులు పాల్గొన్నారు. తొలుత రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీలు, సీఐలు మర్యాద పూర్వకంగా కలిశారు.


పాపినేని శివశంకర్, జీఎస్ చలానికి పురస్కారాలు ప్రదానం చేసిన ద్వారకా తిరుమలరావు, సీహెచ్ సుశీలమ్మ

అంబేడ్కర్‌కు ఘన నివాళులు





నగరంపాలెం: దేశంలో అందరూ హక్కులు పొందేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా మంగళవారం కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని రేంజ్ ఐజీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తన కార్యాలయంలో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఆర్ఐ సూర్యభాస్కరరావు, శివకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్


మాట్లాడుతున్న ఎస్. విక్టర్ ఇమ్మానుయేల్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్ (రిటైర్డ్ జడ్జి) పాల్గొన్నారు. మొత్తం 15 ఫిర్యాదులు వచ్చాయి. 12 అక్కడికక్కడే పరిష్కారం అయ్యాయి. మిగతా వాటిపై విద్యుత్‌శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమరావతి విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కె. సంజీవరావు, సాంకేతిక సభ్యులు వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవరావు, డిప్యూటీ ఇంజనీర్ డి. సురేష్ బాబు, పర్యవేక్షక ఇంజనీర్ ఇ. సుబ్రహ్మణ్యం, మంగళగిరి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీలో రాజ్యాంగ దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు

గుంటూరు రూరల్: నగర శివారు లాంఫాం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం జరిగింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీసీ డాక్టర్ ఆర్. శారదజయలక్ష్మీదేవి మాట్లాడుతూ రాజ్యాంగం కులమతాలకు అతీతంగా వ్యక్తి స్వేచ్ఛగా ఉండేలా రూపొందించారని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు రాజ్యాంగ పీఠికలోని అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎ.మణి, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బి.శ్రీలక్ష్మి, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం గొప్ప పరోపకారం




లక్ష్మీపురం: రక్తదానం గొప్ప పరోపకారమని కేంద్ర జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం గుంటూరు కన్నవారితోటలోని జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడతామని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ ఎం.భాస్కరరావు, జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ బి.రవి కుమార్, సూపరింటెండెంట్లు చీదేళ్ళ ఈశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమైక్య జీవనానికి రాజ్యాంగమే కారణం


ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో రేణుక, ఉద్యోగులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ప్రజలు సమైక్యంగా జీవించడానికి గొప్ప రాజ్యాంగమే కారణమని పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ వద్ద ఉన్న ఆర్జేడీ, డీఈవో కార్యాలయ సముదాయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆర్జేడీ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యదేశంలో భిన్న భాషలు, మతాలు, సంస్కృతులు, వర్గాల ప్రజలు సమైక్యంగా జీవించడానికి అతి పెద్ద లిఖిత రాజ్యాంగమే కారణమని అన్నారు. డీఈవో మాట్లాడుతూ మన రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శనీయం అన్నారు. అధికారులు, ఉద్యోగులు రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆడిటర్ బాలకృష్ణయ్య , ఏడీ నిర్మలా రాణి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఎం కార్యాలయంలో..


ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డీఆర్ఎం ఎం.రామకృష్ణ ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉద్యోగులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె. సైమన్, సీనియర్ డీపీఓ షాహబాజ్ హనూర్, సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.